క్లుప్తంగా

లారీ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి



నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

చెన్నూర్: లారీ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని కోరుతూ గురువారం స్థానిక బైపాస్ రోడ్డులో లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వీరి నిరసనకు ఐఎఫ్‌టీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు మాట్లాడుతూ.. ఐకేపీ సెంటర్లకు వరి ధాన్యాన్ని చేరవేసేందుకు రవీందర్ అనే వ్యక్తి కాంట్రాక్ట్ తీసుకున్నారని తెలిపారు. సెక్టార్ మూడు భీమారం నుంచి చెన్నూర్‌కు వరిధాన్యాన్ని చేరవేయాల్సి ఉంటుందన్నారు. చెన్నూర్ పట్టణంలో 70 లారీలు ఉన్నాయని, స్థానిక లారీలకు పని కల్పించకుండా సదరు కాంట్రాక్టర్ నాన్‌లోక్ లారీలకు అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సదరు కాంట్రాక్టర్ రవీందర్ స్థానిక లారీలకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గోపినాథ్, చెన్నూర్ డివిజన్ అధ్యక్షుడు రమేశ్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్‌ఖాన్, కార్యదర్శి మల్లేశ్, కృష్ణ పాల్గొన్నారు.

‘అడ్మిషన్ల కోసం అసత్య ప్రచారాలు’

మంచిర్యాలఅర్బన్: కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల కోసం అసత్య ప్రచారాలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని టీవీయూవీ ఆధ్వర్యంలో గురువారం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలల అనుమతి కోసం యాజమాన్యం సమర్పిస్తున్న ఫీజు వివరాలు, తర్వాత వసూలు చేస్తున్న ఫీజులకు పొంతన లేకుండా ఉంటుందన్నారు. ఐఐటీ, సీబీఎస్ఈ, గ్లోబల్ లాంటి పేర్లను జోడించి కరపత్రాలతో అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. తల్లిదండ్రులు మోసపోకుండా చూడాలని కోరారు.

బీజేపీ ప్రచారం



బీజేపీలో చేరుతున్న నాయకులు

జన్నారం: ప్రధానమంత్రిగా మూడోసారి నరేంద్రమోదీకి అవకాశం కల్పిస్తే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూధన్‌రావు అన్నారు. మండలంలోని ధర్మారంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. వారికి ఆయన కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బెడద గోపాల్, ప్రభాకర్, భూమన్న, రామచంద్రం, సతీశ్, పాల్గొన్నారు.

ఆదాయపు పన్నుపై అవగాహన

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతున్న విద్యార్థులకు ఆదాయపు పన్నుపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంపల్లి శంకర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బెల్లంపల్లికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ కె.సాయినాథ్ కార్యక్రమానికి హాజరై ఆదాయం పన్ను విధింపు, చెల్లింపుల గురించి విద్యార్థులకు వివరించారు. ఆదాయపు పన్ను చట్టం 1961 గురించి తెలిపారు. కామర్స్ సంబంధిత అంశాలు, పన్నులు ఇతర అంశాల గురించి వివరించి విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు పైడాకుల రవి, కిషన్ పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత



భీమారం: ఓ యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై బి. రాములు తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వడ్లకొండ పవన్ తన సెల్‌ఫోన్‌ని ఏప్రిల్ 4వ తేదీనా రోడ్డుపై పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్ ఆచూకీ కనుకొన్న పోలీసులు దానిని స్వాధీన పర్చుకొని పవన్‌కి అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ మాచర్ల, పున్నం ఉన్నారు.

అమ్మవారి చెంత.. సమస్యల చింత

- ఎండలో భక్తుల ఇక్కట్లు, నీటికి తిప్పలు
- ఎమ్మెల్యే పట్టించుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



చెట్టు నీడలో వంట చేసుకుంటున్న భక్తులు

జన్నారం: దశాబ్దాల కాలం క్రితం ఇందూరు నుంచి స్వయంభువుగా కవ్వాల్‌లోని అటవీ ప్రాంతంలో వెలసిన అమ్మవారు పోచమ్మ తల్లి. అమ్మవారు ఐదు దశబ్దాల క్రితం వెలసినా, అభివృద్ధికి నోచుకోవడం లేదు. పోచమ్మ ఆలయం చెంత.. సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎండ వేడికి, నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు.

సౌకర్యాలు కరువు..

సుదూర ప్రాంతాల నుంచి ఎందరో భక్తులు అమ్మవారి దగ్గరకు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. కానీ భక్తుల కోసం ఇక్కడ సౌకర్యాలు కరువయ్యాయి. చెట్ల నీడనే వంటలు చేసుకుని ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. మంచి నీటి సౌకర్యం కూడా లేదు. కవ్వాల్ నుంచి హాస్టల్ తాండా వరకు బీటీ రోడ్డు ఉన్నా, అక్కడి నుంచి అమ్మవారి ఆలయం వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షకాలం అక్కడికి వెళ్లడం చాలా కష్టంగా మారుతోంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో నీడ సౌకర్యం లేకపోవడంతో దశబ్దాల కాలంగా చెట్ల నీడలోనే భక్తులు గడుపుతున్నారు. ఇటీవల గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వారు భక్తుల ఇక్కట్ల గుర్తించి ఆలయం వద్ద సిమెంట్ రేకులతో షెడ్డు నిర్మించారు.

కబ్జాకు గురైన భూమి..

పోచమ్మ తల్లి ఆలయం పేరున 11గుంటల భూమి దేవదాయశాఖ వారు పట్టా చేపించారు. కానీ ప్రస్తుతం ఆలయం పరిసరాలతో కలిపి కేవలం ఆరు గుంటల వరకే ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో దేవదాయశాఖ అధికారులు 11గుంటల భూమి ఉన్నట్లు బోర్డు అమర్చారు. కానీ ఆలయ పరిసర భూములు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి భక్తులు..



గుడిసెలో కొలువుదీరిన పోచమ్మ తల్లి

జన్నారం మండలం కవ్వాల్‌లో వెలసిన అమ్మవారు పోచమ్మ తల్లి. ఇందూరు నుంచి గోదావరి మీదుగా అటవీ సమీప ప్రాంతంలో అమ్మవారు వెలసినట్లు పూర్వీకులు చెబుతారు. పూర్వ కాలం నుంచి ఆదివాసీ గోండు గిరిజనులు పోచమ్మ తల్లికి ప్రతీ సంవత్సరం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే బస చేసి పూజలు చేస్తుంటారు. ఆదివాసీ గిరిజనులతో పాటు అన్ని కులాల వారు అమ్మవారికి ప్రతీ సంవత్సరం పూజలు జరుపుతారు. వారంలో గురు, ఆది వారాలు అమ్మవారి వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామాల్లో ఏ శుభకార్యాలు జరిగినా, వ్యవసాయ పనులు మొదలు పెట్టే సమయంలో అమ్మవారి వద్దకు కుటుంబంతో సహా వచ్చి మొక్కులు తీర్చుకుని వంటలు చేసుకుని భోజనాలు చేసి తిరిగి ప్రయాణం అవుతారు. జన్నారం మండలంతో పాటుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు.

ఎమ్మెల్యే దృష్టి సారించాలని వేడుకోలు..

దశాబ్దాల కాలంగా అమ్మవారు పోచమ్మ తల్లి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. కోరిన భక్తుల కొంగు బంగారంగా నిలిచే అమ్మవారి ఆలయం అభివృద్ధిపై ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జు పటేల్ దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. ఇటీవల కవ్వాల్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఈ విషయాన్ని విన్నవించారు. అదే విధంగా తాను ఎమ్మెల్యేగా గెలిచాక అమ్మవారి వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే దృష్టి సారించి ఆలయం వరకు రోడ్డు, ఆలయం పరిసర ప్రాంతాలు అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

మందమర్రిలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేవిదంగా ప్రతి ఒక్కరు సహకరించాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి కోరారు. గురువారం మందమర్రి పట్టణంలోని పలు వీదుల్లో కేంద్ర బలగాలతో ప్రాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ప్లాగ్ మార్చ్ జీఎం ఆఫీస్ వద్ద ప్రారంభమై జాతీయ రహదారి గుండా పలు వీదుల మీదుగా సాగింది. అనంతరం సీఐ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగడానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఇన్స్‌పెక్టర్ రాకేష్ మిశ్రా, మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్ ఎస్సైలు రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, వంద మంది బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య వర్ధంతి



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు



హాజీపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లక్సెట్టిపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, దివంగత చుంచు లక్ష్మయ్య వర్ధంతిని గురువారం హాజీపూర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకుడు జూపాక ధర్మయ్య ఆధ్వర్యంలో హాజీపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన వేడుకల్లో చుంచు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చుంచు లక్ష్మయ్య తనయుడు చుంచు శ్రీనంద ఈ వేడుకల్లో పాల్గొని తన తండ్రి ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు ఆర్.లింగయ్య, స్థానికులు జె.బుచ్చయ్య, యుగంధర్, మనోహర్ పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం కోసం పోరాటం చేయాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం మాజీ ఎమ్మెల్యే చుంచు లక్ష్మయ్య వర్ధంతిని తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చుంచు లక్ష్మయ్య బీసీల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, తెలంగాణ బీసీ జాగృతి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ప్రధాన కార్యదర్శి సదానందం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డారు.. శతశాతం సాధించారు



పాఠశాల ఎదుట విద్యార్థులు, ఉపాధ్యాయులు



జైపూర్: విజయ సంకేతం చూపుతూ...

జన్నారం: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల కష్టం ఫలించింది. మండలంలో బాదంపల్లి, చింతగూడ రెండు పాఠశాలలు కష్టపడి శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతుల నిర్వహణ, వాట్సాప్ ద్వారా గ్రూపు ఏర్పాటు చేసి రోజువారీగా విద్యార్థులు చదివిన విధానం పరిశీలించడంతో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు బాదంపల్లి హెచ్‌ఎం ప్రభాకర్ తెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శ్రద్ధ వహించి, ఫలితాలు తెచ్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

పొనూర్ పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత

జైపూర్: మండలంలోని పొనూర్ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. గ్రామీణ ప్రాంతంలోని పొనూర్ పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించడంపై ఉపాధ్యాయులను అందరూ అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం సన్మానించారు. 8జీపీఏ నుంచి 9.7 జీపీఏ సాధించిన వరుణ్‌తేజ్, వరుణ్, అజయ్‌తో పాటు తొమ్మిది మంది విద్యార్థులను ఎంఈవో పోచయ్య చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, చౌదరి, అమ్మ ఆదర్శకమిటీ చైర్మన్ శబానా భాను, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి



మందమర్రిరూరల్: మాట్లాడుతున్న జీఎం మనోహర్



చెన్నూర్: క్యాంపునకు హాజరైన విద్యార్థులు



ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ సహకారంతో ఏరియాలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో గురువారం ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడల కోచింగ్ క్యాంపులను ప్రారంభించారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు గురువారం వేసవి కాలం వాలీబాల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ గాజుల శ్రీనివాస్, జాతీయ స్థాయి క్రీడాకారులు మనోహర్, శ్రీవర్షిణి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ శిబిరం ప్రారంభం

చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం అథ్లెటిక్స్ వేసవి శిబిరాన్ని ఎంపీడీవో మోహన్ ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు, శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ సంతోశ్, పీడీ ఫణిరాజా, దాసరి మల్లేశ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ ఏఎంసీ క్రీడా మైదానంలో గురువారం తైక్వాండ్, సెపక్ తక్రా ఉచిత వేసవి శిక్షణ తరగతులను మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా నచ్చిన క్రీడల్లో శిక్షణ తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. తైక్వాండో, సెపక్ తక్రా క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఒత్తిడిని జయించడానికి క్రీడలు దోహదపడతాయ ని వివరించారు. సెపక్ తక్రా కోచ్ బోగే అశోక్, తైక్వాండో సెక్రెటరీ బోగే రాజేష్, ప్రెసిడెంట్ సిద్దమల్ల చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రచారం



నస్పూర్: ప్రచారంలో పాల్గొన్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: వచ్చే పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు.ప్రచారంలో భాగంగా మంచిర్యాల పట్టణంలోని టూటౌన్ ఏరియాలో గల 13, 14, 15 వార్డుల్లో, నస్పూర్ పట్టణ పరిధిలోని 2, 14 వ వార్డుల్లో గురువారం ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేపట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల ఆదరణ తగ్గలేదన్నారు. ప్రజలకు దొంగ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి, బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్, నాయకులు శ్రీపతి శ్రీనివాస్, శ్రీరాముల మల్లేశ్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, నాయకులు సురేందర్‌రెడ్డి, పానుగంటి సత్తయ్య, హైమద్, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో...

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని కన్నాల బస్తీ, బూడిద గడ్డ బస్తీలలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కొప్పుల ఈశ్వర్ కుటుంబ సభ్యులు కొప్పుల నిర్మల, మంగ, కళ్యాణి, శ్రీవాణి, అనూష, మామిడి పద్మ, నవీన్, శ్వేత పాల్గొన్నారు.

కిష్టంపేటలో...

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ప్రచారం చేపట్టారు. ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.

చెన్నూర్‌లో...

చెన్నూర్: మున్సిపాలిటీలో గల 18 వార్డులలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలుపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు జోడు శంకర్, వేల్పుల సుధాకర్, మేడ సురేశ్‌రెడ్డి, జడల మల్లేశ్, ధరణి సంతోశ్, భారతి, రాజారాంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



జైపూర్: పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే వివేక్

దండేపల్లి/లక్సెట్టిపేట/కాసిపేట/జన్నారం/భీమారం/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. లక్సెట్టిపేట మండలంలోని దౌడేపల్లి, ఎల్లారం, కొత్తూరు, వెంకట్రావ్‌పేట, కొమ్ముగూడెం గ్రామాల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీని గెలిపించాలని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం కాంగ్రెస్ హామీలను ప్రజలకు వివరించారు. మందమర్రికి చెందిన నేతకాని కుల సంఘం నాయకుడు సునార్కర్ రాంబాబు, పలువురు కాంగ్రెస్‌లో చేరగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కండువా కప్పి ఆహ్వానించారు. మందమర్రిలోని 8వ వార్డులో కాంగ్రెస్ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మహంతి అర్జున్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కాకా వెంకటస్వామి కుటుంబంపై విమర్శలు చేసే స్థాయి కొప్పుల ఈశ్వర్, బీజేపీ ఎంపీ వెంకటేష్‌నేతకు లేదని కాసిపేటలో మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి గడ్డం జగన్నాథం మండిపడ్డారు. జన్నారం, కవ్వాల్‌లో ఎంపీటీసీ రియాజోద్దీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. హేర్ సెలూన్ దుకాణంలో అబ్బాయికి మిషన్‌తో కటింగ్ చేస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. పేదల సంక్షేమం కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని తెలంగాణ గొర్రెలు, మేకలు పెంపకం దారుల రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ భీమారం మండలంలోని కాజీపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. చెన్నూర్ మండలంలోని సుద్దాలలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు పూజలు చేసి ప్రచారం నిర్వహించారు. దండేపల్లి మండలం మామిడిపల్లిలో ఉపాధి పనుల వద్ద కూలీలను కలిసి కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కూలీలకు మజ్జిగా ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జైపూర్: మండల కేంద్రంతో పాటు, పెగడపల్లి, వెంకట్రావుపల్లి, దుబ్బపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు గురువారం కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కండువా కప్పి ఆహ్వానించారు. పెగడపల్లి మాజీ సర్పంచ్ రిక్కుల రాజమణిరాంమ్‌రెడ్డి, దుస్స భాస్కర్, మొగిళి, తిరుపతిరెడ్డి, జితేందర్‌రెడ్డితో పాటు, స్థానిక నాయకులు, యువకులు పార్టీలో చేరారు. అనంతరం కిష్టాపూర్, వేలాల, పొనూర్, శివ్వారం గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు పాల్గొన్నారు.

‘వంశీకృష్ణకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు’

నస్పూర్: పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంకట రవీందర్ తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. వంశీకృష్ణకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తిప్పారపు రమేశ్, లక్ష్మయ్య, నరేశ్, ప్రజ్వల్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోకు సన్మానం



ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనితను సన్మానిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

మంచిర్యాలటౌన్: జిల్లా ఇన్‌చార్జి నూతన వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అనితను జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ విశ్వేశ్వర్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు ఎం. రమేశ్ కుమార్, వరప్రసాద్, గోపి, అజీజ్, పరమేశ్, సౌందర్య, చంద్రశేఖర్, సుధీర్, శ్రీనివాస్, శోభ, రాజన్న, అనసూర్య పాల్గొన్నారు.

పంట ధ్వంసం చేసిన పశువులు



వేమనపల్లి: మండల కేంద్రంలో పశువుల యజమానులు వాటిని రోడ్ల వెంట, పంట పొలాల వైపు వదిలేస్తుండటంతో రైతులకు ఇబ్బందిగా మారుతోంది. మండలంలోని కొత్తపల్లి శివారులో గురువారం సుమారు యాభై పశువులు చేతికొచ్చిన వరి పొలంలో దిగి నాశనం చేశాయి. అది గమనించిన రైతులు అడ్డుకొని పశువులను అక్కడి నుంచి వెళ్లగొట్టి నష్టాన్ని నివారించారు. గ్రామపంచాయతీ సిబ్బంది కాని, ప్రత్యేక అధికారి కానీ పశువుల బెడదను అరికట్టలేకపోతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.